

ఇటు ఇంగ్లిష్.. అటు తెలుగు

- ద్విభాషలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణ
- గతేడాది నుంచే అందుబాటులోకి..
- తెలుగు మీడియం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం
- పేజీలు ఎక్కువగా ఉండడంతో రెండు భాగాలుగా విభజన



ఫిజిక్స్, గణితం ద్విభాషా పాఠ్యపుస్తకాలు


రెండు భాషలలో ముద్రించి ఉన్న పాఠ్యపుస్తకం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో వారికి పాఠాలు సులభంగా అర్థమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశాల రూపకల్పనలో ఏటా ఏదో ఒకమార్పు చేస్తూ కొత్త బోధన పద్ధతులను తీర్చిదిద్దుతోంది. ఇందులో భాగంగానే నాలుగేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించింది. అయితే అప్పటి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో చదవడం కష్టతరంగా మారింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాఠాలను అర్థం చేసుకోలేకపోతున్నారని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. దీన్ని అధిగమించడానికి పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను ఒకపక్క ఇంగ్లిష్, మరోపక్క తెలుగులో ముద్రించి ఇవ్వాలని నిర్ణయించింది. గతేడాది నుంచి 1 నుంచి 10వ తరగతి వరకు గణితం, ఫిజిక్స్, బయాలజీ, సాంఘికశాస్త్రం పాఠపుస్తకాలను ఇంగ్లిష్, తెలుగు ద్విభాషలో అచ్చు వేసి పంపిణీ చేసింది.

ప్రతి పాఠం రెండు భాషల్లో..

పాఠ్య పుస్తకాలలో ప్రతి పాఠాన్ని రెండు భాషల్లో ముద్రించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఏడాది కూడా తెలుగు, ఇంగ్లిష్, హిందీ మినహా మిగతా గణితం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, భౌతిక రసాయన శాస్త్రాల పాఠ్యపుస్తకాల్లోని మొత్తం చాప్టర్లను ఒకపేజీ ఇంగ్లిష్, దానిపక్కనే మరో పేజీలో తెలుగు భాషల్లో ముద్రించారు. కానీ పేజీలు పెరగడంతో వీటి పరిమాణం, బరువు ఎక్కువ అవుతుండటంతో విద్యార్థుల సౌలభ్యం కోసం రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగం జూన్ నుంచి అక్టోబర్ వరకు ఎస్ఏ-1 పరీక్షల కోసం పార్ట్-1గా, రెండవ భాగం నవంబర్ నుంచి మార్చి వరకు ఎస్ఏ-2 పరీక్షల కోసం (పార్ట్-2)గా విభజించారు.

ఆకర్షణీయంగా, అర్థవంతంగా..

పాఠశాలలు పునఃప్రారంభమైన 12వ తేదీ నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. పుస్తకాల కవర్ పేజీ ముద్రణలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ పుస్తకాలలో పాఠ్యాంశాలకు అనుగుణంగా రంగురంగుల బొమ్మలు చూడగానే పాఠం సారాంశం అర్థమయ్యేలా, ఆకర్షణీయంగా ముచ్చటగా ఉన్నాయి. దీనికి తోడు పాఠ్యపుస్తకాలలో ప్రతీ పాఠానికి ఒక క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీనిని మొబైల్ ద్వారా స్కాన్ చేసి ఆ పాఠానికి సంబంధిచిన వీడియోలను వీక్షించవచ్చు. తద్వారా తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో సులువుగా చదివి రాణిస్తారని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

ఇంగ్లిష్‌లో అర్థం కాకపోతే తెలుగులో చూడవచ్చు



“ఉపాధ్యాయులు ఇంగ్లిష్ భాషలో బోధించినప్పుడు అర్థం కాని విద్యార్థులు పక్క పేజీలో ఉన్న తెలుగును చదివి అర్థంచేసుకోవడానికి ఈ పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయి. స్కూళ్ల ప్రారంభం రోజు నుంచే పాఠ్యపుస్తకాల పంపిణీ మొదలైంది.

- శేషగాని శ్రీనివాస్ గౌడ్, ఎంఈఓ, సూర్యాపేట

ద్విభాషల్లో ముద్రించడం చాలా ఉపయుక్తం



“పాఠ్యపుస్తకాలను ద్విభాషలో ముద్రించడంతో విద్యార్థులకు చాలా ఉపయుక్తంగా ఉన్నాయి. ఇంగ్లిష్ మీడియంలో వెనకబడిన విద్యార్థులు తెలుగులో చదివి అవగాహన పెంచుకొని రాణించేందుకు ఉపయోగపడుతాయి.

- వి.వెంకటేశ్వర్లు, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్ ఇమాంపేట

క్లుప్తంగా

మంత్రిని కలిసిన రమేష్‌రెడ్డి


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న రమేష్‌రెడ్డి

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, యూత్ అండ్ స్పోర్ట్స్‌శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాకటి శ్రీహరిని సోమవారం సచివాలయంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ


పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేస్తున్న ఎంఎన్ఓ ప్రభాకర్, ఉపాధ్యాయులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ను మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి.చంద్రారెడ్డి, జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు వర్దెల్లి కృష్ణయ్య, పీఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అర్వపల్లి : అర్వపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి కాటూరి రామానుజాచార్యులు తెలిపారు. ఈ వసతి గృహంలో 100 సీట్లకు గాను 60 సీట్లు ఖాళీగా ఉన్నాయని, 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుకునే ఎస్సీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ వసతి గృహంలో అన్ని వసతులు ఉన్నాయని, ప్రత్యేక విద్యా బోధన జరుగుతుందని చెప్పారు. రెండు హైవేలపై ఉన్న ఇక్కడి వసతి గృహం చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు ఎంతో అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా యోగా, ధ్యానం తరగతులు కూడా ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రం వద్ద టీయూసీఐ రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్లన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా కమిటీ సభ్యులు దర్శనం రమేష్, చెడుపాక రవి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు మిట్టగడుపల నాగయ్య, వేల్పుగొండ నాగార్జున, మర్రి జ్యోతి, కలకోట్ల రాములు, కట్టా హరిబాబు, వీరబోయిన లింగయ్య, దండా వెంకన్న, జటంగి వెంకన్న పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి


కోటయ్య(ఫైల్)

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన రెంటాల కోటయ్య(110) సోమవారం మృతి చెందారు. ఆయన ఇప్పటి వరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగానే ఉన్నారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో మాట్లాడుకుంటూనే ప్రాణాలు విడిచారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన ఇప్పటికే నాలుగు తరాల వారిని చూశారు. కాగా మాలమహానాడు జాతీయ నాయకుడు రెంటాల కరుణకుమార్‌తోపాటు పలువురు నివాళులర్పించారు.

డంపింగ్ యార్డును తరలించాలని వినతి

తిరుమలగిరి : తిరుమలగిరి నుంచి నెల్లిబండ తండాకు వెళ్లే దారిలో ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నెల్లిబండ తండాకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన డంపింగ్ యార్డు ఉండటంతో చెత్తా, చెదారం మొత్తం రోడ్ల మీదనే పడిపోతుందని, కోతుల బెడదతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌పవార్, రాజు, రమేష్, బాలాజీ, యాకూబ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నెల్లిబండ తండా గ్రామస్తులు

పారిశుద్ధ్యం, పచ్చదనానికి ప్రాధాన్యమివ్వాలి


తిరుమలగిరిలో మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

- ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని తెలిపారు. తిరుమలగిరి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతానని తెలిపారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను రద్దు చేసి రైతులకు ఉపయోగపడే విధంగా గోదాములు నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు వై.నరేష్, పేరాల వీరేష్, మూల అశోక్‌రెడ్డి, రాపాక సోమేష్, ఎండీ.హఫీజ్, కందుకూరి అంబేద్కర్, లక్ష్మయ్య, పవార్, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తుంగతుర్తి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 11 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. అనేకసార్లు నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

నూతనకల్ : మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ద్వారా అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రమణాకర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి నుంచి బీపీటీ 5204 అనే వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు 30కేజీల బస్తాకు రూ.1150చెల్లించి తీసుకెళ్లాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రతిభ


పసునూటి సుమశ్రీ


ఎస్‌కే అస్లాతబసుం

ఆత్మకూర్(ఎస్) : ఇంటర్ బోర్డ్ ఆదివారం ప్రకటించిన ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో మండల పరిధిలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని స్టేట్ ర్యాంక్ సాధించింది. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ గ్రూప్ చదువుతున్న పసునూటి సుమశ్రీ గతంలో 465 మార్కులు సాధించగా ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల అనంతరం 468 మార్కులు పొందింది. దీంతో సుమశ్రీ స్టేట్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా సుమశ్రీని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ గుణగంటి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు అభినందించారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్/జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ఎస్‌కె.అస్లాతబసుం 445/470, బైపీసీ విభాగంలో మల్లేపాక శృతి 436/440, సీఈసీ విభాగంలో జి.మహేష్ 353/500 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

క్రమశిక్షణతో చదివి మంచిపేరు తేవాలి


తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారితోషికం అందజేస్తున్న సంకెపల్లి విజయరెడ్డి


నాగారం : పాటిమీదిగూడెం పాఠశాలలో నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిండగ నరసయ్య, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మామిడి వెంకన్న అన్నారు. సోమవారం దోసపహాడ్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 7వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళ్యాణి, నాగమణి, రామ్మోహన్, ప్రభాకర్, సైదులు, వెంకట్‌రెడ్డి, విజయకుమారి, వెంకన్న, విప్లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సంకెపల్లి విజయారెడ్డి పారితోషికాన్ని అందజేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవ తరగతి ఫలితాల్లో మొదటి స్థానం సాధించిన వైష్ణవికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం పొందిన సాయితరుణ్‌కు రూ.4 వేలు, తృతీయ స్థానం పొందిన సాత్వికకు రూ.3500 నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్, కె.విజయారెడ్డి, సుజాత, ఉపాధ్యాయులు సోమయ్య, జానయ్య, ఉపేంద్ర, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాగారం : విద్యార్థులు ఉచితంగా అందించిన నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు ఆనంద అన్నారు. సోమవారం వర్ధమానుకోటలోని పాటిమీదిగూడెం ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రి బాక్స్‌లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్దెల్లి మల్లయ్య, అనిత, రజిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతికి భారీగా దరఖాస్తులు

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో రెవెన్యూ అధికారులు సోమవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ గ్రామసభలో రైతుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ హరికిషోర్‌శర్మ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రైతుల నుంచి 586 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఆర్ఐ అల్లావుద్దీన్, ఎంపీఎస్ఓ చింతమల్ల రమేష్, సీనియర్ అసిస్టెంట్ షఫీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మార్జున్

సూర్యాపేట : జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మార్జున్ కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వం సూర్యాపేట పట్టణాన్ని జిల్లా కేంద్రంగా మార్చిందన్నారు. జిల్లా కేంద్రంలో కోట్లాది రూపాయలతో అశాస్త్రీయంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నేడు నిరుపయోగంగా మారిందని తెలిపారు. వెంటనే మార్కెట్‌ను ప్రజల సౌకర్యార్థం వివిధ అవసరాలకు వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ స్థలంలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో కూరగాయల మార్కెట్ కోసం వ్యాపారస్తులకు ప్రత్యేక మడిగలు నిర్మించి ఇవ్వాలన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రారంభించి వదిలేసిన ఐటీ హబ్‌ను పునరుద్ధరించి, ఈ ప్రాంత నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించాలని కోరారు. అలాగే నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పరిశుభ్రత, ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యం

- మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పాల్గొన్న మున్సిపల్ కమిషనర్

సూర్యాపేట అర్బన్ : పరిశుభ్రత, ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యంగా 'ఒక చర్య-ఒక మార్పు' అనే నినాదంతో ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైజింగ్-2047 పేరుతో మున్సిపాలిటీ వార్డుల్లో 100 రోజుల ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని 14వ వార్డులో నిర్వహించిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీలో ఆదాయం పెంచుకోవడంతోపాటు అభివృద్ధిని కూడా పెంచాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, డీఈ సత్యారావు, టీఎంసీ శ్వేత, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరెని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధారవత్ వీరన్న నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, వాటర్ సిబ్బంది సమ్మి, చెరుకు వేణు, జవాన్ శ్రీను, వార్డు ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల విద్యకు మొదటి అడుగు అంగన్వాడీ


అర్వపల్లి : కోమటిపల్లి పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న అధికారులు

తుంగతుర్తి : పిల్లల విద్యకు మొదటి మెట్టు అంగన్వాడీ అని సీడీపీఓ శ్రీజ అన్నారు. సోమవారం అన్నారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట - అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాసం నిర్వహించారు. మూడు సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు ఖైరున్నిషా, అనురాధ, పంచాయతీ కార్యదర్శి దుండి రమేష్, అంగన్వాడీ టీచర్లు కలమ్మ, మంగమ్మ, మాధవి, ఉమా, భాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పిల్లలను ఇక్కడి పాఠశాలకే పంపాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, ఎంపీడీఓ టి.గోపి, ఎంఎన్ఓ కుంభం ప్రభాకర్, హెచ్ఎం ఉల్లెందుల సైదులు, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనిత, ఉపాధ్యాయులు ఆర్.సృజన, కె.రమేష్, అంగన్‌వాడీ టీచర్స్ టి.శివరంజని, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండలకేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులత రెడ్డి పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


తుంగతుర్తి : అన్నారంలో అక్షరాభ్యాసం..


నూతనకల్ : అంగన్‌వాడీ కేంద్రంలో..

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి


తాళ్లగడ్డ : టేకుమట్ల రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు


ఆత్మకూర్ (ఎస్) : రైతువేదికలో..


నాగారం : ఫణిగిరి రైతువేదికలో..

పెన్‌పహాడ్ : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, తహసీల్దార్ లాలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. అదే విధంగా మండలంలోని చీదెళ్ల, అనాజీపురం రైతు వేదిక కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్‌లను ప్రారంభించి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, ఏఈఓలు శ్రావణి, చైతన్య, మురళీ, ప్రణయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లగడ్డ (సూర్యాపేట) : రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా పలు రైతు వేదికల్లో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు, అధికారులు సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. టేకుమట్లలో ఎంపీడీఓ బాలక్రిష్ణ, యండ్లపల్లిలో తహసీల్దార్ కృష్ణయ్య, కేసారంలో ఏఓ కృష్ణ సందీప్‌లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దయానందం అన్నారు. సోమవారం కొత్తగూడెం రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రమేష్ బాబు, ఏఈఓ సాయి సజన పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఎంతో ముఖాముఖి వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట, ఫణిగిరి గ్రామాల్లోని రైతువేదికల్లో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి మండలంలోని రైతులు భారీగా హాజరై సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఏఓ కృష్ణకాంత్ మాట్లాడారు. రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించేలా సీఎం రైతులకు సూచనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికిశోర్ శర్మ, ఎంపీడీఓ మారయ్య, ఏఓ కృష్ణకాంత్, ఏఈఓలు సాయిరాజ్, శ్రీనివాస్, సంధ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : తిమ్మాపురం రైతువేదికలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన ప్రాంభోత్సవం నిర్వహించారు. అలాగే తిమ్మాపురం, రామన్నగూడెం వేదికలలో రైతు నేస్తం కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఏఓ గణేష్, ఏఈఓలు సత్యం, శోభారాణి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతనకల్ : రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమాన్ని మండలంలోని తాళ్లసింగారం, దిర్శనపల్లి, మిర్యాల గ్రామాల్లోని రైతువేదికల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. దిర్శనపల్లి, మిర్యాల రైతు వేదిక కార్యాలయాల్లో నూతనంగా వీడియో కాన్ఫరెన్స్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ, మండల వ్యవసాయ అధికారి మురళీబాబు పాల్గొన్నారు.

మద్దిరాల : నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ ఎస్.రమేష్‌బాబు అన్నారు. ఆదివారం గోరెంట్ల రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతునేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎల్ఈడీ స్క్రీన్ సహాయంతో పంటల సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ అనిషా రూహి, హార్టికల్చర్ అధికారి ప్రమిత, ఏఈఓలు మనోహర్, అనూష, రైతులు పాల్గొన్నారు.


అర్వపల్లి : రామన్నగూడెం రైతువేదికలో..


పెన్‌పహాడ్‌లోని రైతువేదిక కార్యాలయంలో..


నూతనకల్ : తాళ్లసింగారంలో..

సంక్షిప్త సమాచారం

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

నూతనకల్ : మండల పరిధిలోని బక్కహేమ్లాతండా ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. తండాలోని ప్రాథమిక పాఠశాలలో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన చెట్లను సోమవారం కొంతమంది వ్యక్తులు తమ స్వలాభం కోసం జేసీబీ సహాయంతో తొలగించి బొగ్గు బట్టీల వారికి అమ్ముకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తండావాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ బడులకు పెరుగుతున్న ఆదరణ

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని మండల విద్యాధికారి బి.బాలు నాయక్ చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 12 మంది వివిధ తరగతుల విద్యార్థులను ఎంఈఓ సమక్షంలో కాసర్లపహాడ్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించుకొని అడ్మిషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం ఇ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దబ్బేటి యాదగిరి, భూపతి శ్రీనివాస్‌గౌడ్, కె.పుష్పలత, దండుగుల యల్లయ్య, అంగన్‌వాడీ టీచర్ రేణుక, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.